# తెల్లబోయిన వెన్నెల

వెన్నెల కన్నతల్లి వెలుగుతోంది తెల్లగా. పేదలపాలిటి దీపం పరుచుకుంది విచ్చుకున్న మల్లెలా. సీతమ్మ గుడిసెలో పోతున్న ప్రాణంలా గుడ్డిదీపం. గుడిసెముందు మంచి మనసులా స్వచ్ఛమైన వెన్నెల దీపం.

గుడిసెలో దీపానికి గుండ్రంగా తిరుగుతున్నాయి కొన్ని పురుగులు.

ఆకాశదీపానికి అన్ని వైపులా అల్లుకున్నాయి అనంతమైన తారకలు.

బయటకోసారి తొంగి చూసి గుమ్మంలో చతికిలపడింది సీతమ్మ.

రోడ్డు కటువైపు కిళ్ళీకొట్టులో చిన్న లాంతరు వెన్నెలతో పరాచికా లాడబోయి ముఖం చిన్నబుచ్చుకుంది.

"యాడికి పోయినట్టో యీడు. అంతులేదు...."

సన్నగా గొణుక్కుంది సీతమ్మ.

"కోపంతో ఇంటికేసి రాడో ఏం గోలో...." ఏదో భయంతో చేతులు జోడించి భగవంతుణ్ణి తల్చుకుంది.

"ఏం సీతమ్మా!"

"నువ్వా బుచ్చెమ్మా! చాన్నాళ్ళయింది నిన్నుసూసి. ఎట్టున్నావ్?"

"బానే ఉన్నా, నీ కొడుకేవన్నా మారినాడా?"

"ఆ..., నేను నచ్చింనాకా ఆడు మారడు, ఇయ్యాల్ల స్నూన

రాదూ....పొద్దున్ననంగ జగడం వెట్టుకు పోయినోడు ఇంతరాత్రిదంక అంతులేదు."

"నీ పిచ్చిగానీ సీతమ్మా....నిన్నాడు పోసించాల్సింది పోయి...."

"అదంతేనమ్మా! నా కర్మ!"

"నువ్వు కట్టంసేసి డబ్బుసంపాయించి ఆడికి ఏల్టికి కూడెట్టడం, అడిగితే డబ్బులు చేతులో ఎట్టడం సేస్తంటే ఆడు బలాదూరు తిరగ తానే ఉంటాడు."

"మరేం సెయ్యమన్నావు సెప్పు. ఎంతైనా కన్నకొడుకుగ్గదా! నువ్వు సంపాయిత్తేగానీ, నీ కూడొండిపెట్టనంటే, పని చేసుకోటానికీ బద్దకం గనక దొంగతనాలు మరుగుతాడని బయం. అసలే ఇన్ని సెడ్డ అలవాట్లున్నాయి. ఇంకదికూడా తోడవుద్ది."

"ఏటో .... రకరకాల మనుసులు" ముందుకి సాగిపోయింది బుచ్చెమ్మ.

"రోడ్డుమీద వచ్చేపోయే వాళ్ళని చూస్తూ అలాగే కూర్చుంది సీతమ్మ.

దీపంచుట్టూ పురుగుల్లా, మనసులో ఆలోచనలు తిరుగుతున్నాయి. చిన్నతనంనించీ గడిచిన కాలం కళ్ళముందు కట్టింది....

అయ్యంటే చచ్చే భయం సీతకి.

ఒక్కనాడన్నా దగ్గిరికి తీసుకుని ప్రేమగా కబుర్లు చెప్పనందుకు అయ్యంటే కోపంకూడా వుంది.

ఓనాడు అమ్మని రబ్బరుగాజులు కొనిపెట్టమని అడిగితే సూద్దాంలే అనూరుకుంది.

అయట్టా ఊరుకున్నాడేటి? తనేం తప్పుచేసిందని? గాజులు కొని పెట్టమంది అంతేగా! అంతమాత్రానికే వొచ్చి వీపుమీదెంత గట్టిగా బాదిండు....ఎప్పుడంతే అయ్య .... ఒక్కనాడన్నా తను కావాలన్న దిచ్చిండా? మళ్ళీసూత్తే జేబిలో డబ్బులు గలగల్లాడుతూనే ఉంటయ్!

ఆ డబ్బులెట్టి తాగుతాడు....అమ్మెవరితోనో సెప్తుంటే ఇన్నదిగా తను. అందుకే అయ్యకాడికి వోవాలంటేనే హడల్....

తనకి మనువని యిన్నకాడినించీ ఎంత పొంగిపోయిందీ.... ఆ వొచ్చేవోడు అయ్యలాటోడు కాకూడదని ఎన్నో దేవుల్లకి మొక్కింది. అయ్య కొనివ్వని రిబ్బనుముక్కలు, గాజులు ఆ వొచ్చేవోడే దండిగా కొని ముద్దుగా ఇవ్వకపోతాడా అని ఎంత ఆశపడ్డది. పేమగా తనని సూసుకుంటాడని ఎంత మురిసిపోయింది. అంతా కల్లే. తను మనుసు పడిందొక్కటి జరిగితే ఒట్టు....మావ, అల్లుడు ఒకటై కూసున్నారు. ఆడికూడా అన్నీ అయ్యబుద్ధులే. ఇద్దరూ కల్సి ఆడోల్లిద్దర్నీ పురుగుల్ని సూసినట్టు సూసినారు కదా! ఆడోళ్ళ బతుకు లింతే ననిపించింది. అయ్య, అమ్మ పోయినంక ఆడు మరింత రెచ్చిపోయిండు. ఎన్ని తడవలో నూతులో దూకాలనిపించి గూడ పుట్టబోయే బిడ్డమీద మమకారంతో బతుకీడ్చు కొచ్చింది.

కన్నతండ్రి పేమగా సూసిందిలేదు.

కట్టుకున్నోడు పేమ సూపలేదు.

ఇక ఈ ముద్దుల బిడ్డయినా తనమాట యిని తనమీద పేమసూపి, అమ్మకూడా ఓ మనిసేనన్నట్టు సూత్తే ఈ బతుక్కింతే సాలుననుకొని ఎంత మురిపెంగా పెంచుకొచ్చింది. మరీ గారాబుసేత్తే సెడిపోతాడని అసలు పేమ సూపించకపోతే మనసు యిరిగిపోద్దనీ ఎన్నో పాట్లుపడి పెద్దచేసుకొచ్చిందాడిని....యిసిత్రం కాపోతే కన్నకొడుగ్గూడా తన మనసుని మండించడవేటో?

కట్టుకున్నోడిని కాలం మింగింది.

మిగిలింది తను....కన్న కొడుకని సెప్పుకుందుకు తప్ప మరేమీ కానిరావుడు.

ఉండడానికి పాతి కేళ్ళున్నయి గాని....పనా, పాటా....ఏవీలేదు.... అయ్యపోలిక, తాత పోలిక యిడవకుండా అబ్బింది.

ఇయ్యాలో, రేపో తనపానం గుటుక్కుమనక తప్పదు. అప్పు డాడి గతి.....

బద్దకం బలిసింది. కష్టబడి పనిసేసుకుని బతకడు. ఎట్టా బతుకు తాడో ఏవో మరి.

అందుకేగా తన కోపికలేవోయినా పొద్దున్న లేసింది మొదలు రాత్రిదంక కష్టపడి ఎన్ని సోట్లో ఒల్లొంచి పనిసేసి, కూడబెట్టే సొమ్ము సాయిత్రమ్మగారింటో దాసిపెట్టమని యిస్తావుంది. ఇయ్యాలతో ఆ అదురుష్టంకూడా లేకపోయింది. ఎల్లా పసికట్టిండో ఏమో తను వాల్లింటో డబ్బు దాసిపెడుతున్నట్టు.... నాల్రోజులమట్టి అల్లింటికాడికెల్లి, ఆ తల్లితో కయ్యవాడతన్నాడు రావుడు.

"మా యమ్మ మీ యింటో దాసినసొమ్ము పడెయ్యండని."

"వాడు రోజూ మా ఇంటిమీద పడి అరుస్తుంటే మా పరు వుండాలా వొద్దా సీతమ్మా" అంటూ ఆ సాయిత్రమ్మగారు యియ్యాల పొద్దున్న అడిగింది.

ఒల్లొంచి, సవటోడ్చి, కష్టపడి తను తినీతినక కూడబెట్టిన మొత్తం సొమ్ము రెండొందల పది రూపాయిలూ ఎవరూ సూడకుండా సేతుల్లో పోసి తీసుకుపొమ్మంది. ఎవరిదగ్గిర దాసిపెట్టుకోవాలో తెలియక ఇయ్యాల్టికి ఇంటోనే వుంచి, రేపటినంగతి సూద్దాంలే అన్న దైర్నంతో రేకుపెట్లో అడుగున పెట్టిందా సొమ్ము.

"నే కూడబెట్టిన సొమ్ము నీకోసవేరా నాయినా రావుడూ, లేపోతే నా ఒక్కదాని పొట్టకి, యియ్యాలో రేపో అన్నట్టున్న నా పానానికి రెక్కలు ముక్కలై సొమ్ము కూడబెట్టి ఏం సేసుకుంటాను? ఇదిగో ఈ రెండొందల పదిరూపాయిలు నేను కూడబెట్టిన సొమ్ము. ఎన్నాల్లబట్టో నేను తినీ తినక దాసిపెడితే యియ్యాల్టికింత పోగడింది. దీంతో ఏదనా సన్న బడ్డీకొట్టు పెట్టుకునో, లేదా నీకుతోసిన ఇంకేదన్నా మంచియాపారం

మొదలెట్టి బతుకుతెరువు సూసుకోమని" రేపు పొద్దుటే రావుడితో సెప్పెయ్యాలి. ఇంక తను గుటుక్కుమన్నా పరవాలేదు. అది బతుకుతాడు.

"పక్కనేదో చప్పుడై, ఆలోచనల గొలుసు తెగి, ఉలిక్కిపడింది సీతమ్మ.

ఎండుటాకుల గలగలల తప్ప మరేమీ కాదు.

కొట్టు కట్టేసి లాంతరు తీసుకుని ఇంటికి బయల్దేరాడు చంద్రయ్య.

రోడ్డుమీద మనుషుల అలికిడి ఆగిపోయింది.

వెలిగే వెన్నెల్లో రివ్వున నవ్వుతోంది నిశ్శబ్దం....

తెల్లని వెన్నెల్లో చలిగాలి.

మరొక్కసారి, ఆఖరిసారి కొడుకు జాడేమైనా కనిపిస్తుందేమోనని ఇటూ, అటూ చూసి గుడిసె లోపలికి వెళ్ళిపోయింది సీతమ్మ.

తడిక తలుపు జేరవేసి, తాడుతో లోపలివైపు కట్టింది. తాడుతో ఆ తలుపు కట్టడం నామమాత్రమే. బైటినించి తేలిగ్గా ఆ ముడి తియ్యొచ్చు .... ఔనుమరి .... రావు డాలస్యంగా వొస్తే ఎప్పుడూ బైట నించి లోపలికి చెయ్యి దూర్చి తలుపు తీసుకుంటాడు.

నిద్ర కాగలేని సీతమ్మ, చింకిచాప పరుచుకుని నడుం వాల్చింది. కొద్ది సేపట్లోనే, అలసిన ఆ శరీరాన్ని నిద్రాదేవి ఆవరించింది.

మంచి నిద్దట్లో, ఏదో అలికిడై ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది సీతమ్మ.

అంతా చీకటిగా ఉంది.

రేకు పెట్టెదగ్గర్నుంచి ఏదో ఆకారం ముందుకి కదిలింది.

"ఎవరదీ ? ఎవరూ .... రావుడూ .... " లేచింది సీతమ్మ.

"కన్న కొడుకన్న పేమైనా లేదు నీకు .... ఉంటే ఇంత డబ్బు మూటకట్టి దాసుకుని లేదు లేదని బుకాయిత్తావా ? ఏం సేసుకుంటావ్

ఇంత డబ్బు ముసిల్దానివి .... " ఆవేశంగానూ, కసిగానూ పలికింది రావుడు గొంతు.

"నేను సెప్పేదినరా, రావుడూ .... ఆ సొమ్ము .... "

"తియ్యమాకూ అంటావ్ .... అంతేగా .... నీకు నామీద పేముంటే ఇంతడబ్బు మూట కట్టి, నాకు సెప్పకుండా దాసిపెట్టుకోవు. కన్న కొడుక్కి కూడా ఇయ్యకండా ఏం సేసుకుందావని అంత డబ్బు మూటకట్టి దాసుకున్నావ్ ముసిల్దానివి .... నీకు తగిన శాస్తిగావాల...."

తన చేతులు పట్టుకుని ఏదో తల్లి చెప్పబోతుంటే, చేతిలోనించి డబ్బు లాక్కుంటోందనే ఊహించాడు రావుడు. పక్కనే ఉన్న కఱ్ఱ తీసుకుని ముసిల్దాని నెత్తిమీద ఒక్కటి వేసి బయటికి పరిగెత్తాడు చేతిలో సొమ్ముతో....

వెన్నెల కన్నతల్లి వెలుగుతూనే ఉంది తెల్లగా ... రావుడినిచూసి కాబోలు మరింత తెల్లబోయింది.

★